# బోన్సాయ్

—ఆలాతా రమేశ్‌బాబు



అతడు ఆమె వైపు కన్నార్పకుండా చూస్తున్నాడు.

"తలెత్తు" అతడి తల్లి అడిగిందామెను.

సన్నని వణుకు... తలెత్త లేక పోయింది.

"ఏం చదివావ్", అడిగింది... అతడి తల్లి.

మర్యాదపూర్వకంగా లేదు ఆ స్వరం. కాగా, మగవాడి తల్లినన్న దర్పం!

''డిగ్రీ'' తలను మరింతగా వంచుతూ ఆమె.

''మా ఇంటికి ఎడమ ప్రక్కగా స్కూలు, ఎదురుగా ఆడపిల్లల కాలేజీ ఉండటం చేత బయటకువెళ్ళిన పిల్ల కాదు అమ్మాయి. పైగా చిన్నప్పటి నుంచీ పెద్దవాళ్ళంటే భయభక్తులతో పాటు సిగ్గెక్కువ'', అన్నది ఆమె తల్లి.

తన కూతురు ప్రవర్తన గురించి మంచిగా చెప్పాలనే ఆత్రుత ఆమె తల్లిది.

''డిగ్రీ చదువుకుని కూడా, అలా తలవంచుకు కూర్చుంటే ఎట్లా? చూడాలని కదా... నేను వచ్చింది. తల పైకెత్తమనండి'' గడుసుగా అతడు.

మామూలు కంటే భిన్నంగా జరిగిన వాతావరణం.

దశాబ్దపు వెనకటి జ్ఞాపకం ఆమె కళ్ళలో కదిలింది.

ఆ రోజు......

విమానం వెళ్తోన్న శబ్దానికి ఒక్క ఉదుటున ఇంటి పెరట్లోకి గెంతింది తను.

ఆకాశంలోకి చూస్తూ చప్పట్లు చరిచింది.

ఆ సందర్భంలో నెల రోజుల క్రిందటే...... కొత్తగావేసిన పైట......

ఎప్పుడు జారిందో......

''సిగ్గూశరముూ లేకపోతే సరి'' చీదరించుకున్నాడు అన్న.

ఎందుకు తిడుతున్నాడమ్మా అనుకునే లోపలే...

''ఏమిటే నిగడదన్ని చూడటం. నువ్వేమన్నా మగవాడితో సమానం అనుకున్నావా?

అణిగి మణిగి ఉండటం తెలుసుకో. ముందు తల వంచి ఆ వోణీ సరి చేసుకో'' కసిరింది అమ్మ.

''ఒళ్ళు పైనా తెలియడం లేదులా ఉందే... దానికి! గుడ్డలు సరిగా ఉన్నాయా, లేదా అని చూసుకునే పని లేదా? ఒంటి మీద గుడ్డలు మరిచిపోయేంత ఆనందం పనికిరాదు ఆడదానికి'' ముఖం చిట్లించాడు నాన్న.

అన్ని వేళల్లో కాపలా కాయవలసిన ఒక జంతువునైనట్టు, తమ చెప్పు చేతల్లో ఉండవలసిన ఒక వస్తువునైనట్టు, వారికిష్టమైన పనులు మాత్రమే తను చేయ వలసిన బాధ్యత వున్న [illegible]

ఇలా నిర్బంధిస్తారేమిటి?

ఎందుకు తన పట్ల వీళ్ళిలా ప్రవర్తిస్తున్నారు?

ఎప్పుడూ ఎవరో ఒకరి అదుపాజ్ఞలలో మెలగటం ఆడవాళ్ళ శాపం అయినట్టు పదే పదే హెచ్చరిస్తారెందుకని?

''అందరూ ఆడవాళ్ళను తక్కువగా చూస్తారెందుకు నానమ్మా'' ఓ రోజడిగాను.

''పరిస్థితులు మగవాళ్ళకే అనుకూలంగా ఉన్నాయమ్మా. అందువల్లనే మన హద్దులు తెలుసుకుని బ్రతకడం నేర్చుకోవాలి!''

''ఎందుకు? ఏం తప్పు చేశామని అలా నేర్చుకోవాలి?''

''తప్పు చేశామని కాదమ్మా. ఆడ, మగా మధ్య ఉన్న అసమాన పరిస్తితులకు తలవంచాలి. ఈ అసమాన సమస్యల సముద్రం దగ్గర... అలల్లా వచ్చే ఈ సమస్యలకు తలవంచితే... వంచిన తల మీదుగా పోతాయి. తలెత్తితే, తలతో పాటు మొత్తం శరీరాన్నే కబళించి వేస్తాయి. అయినా... ఎందుకీ ఆలోచనలు, పిచ్చి పిల్లా...'' మందలించింది.

జీవితమంతా ఇలా ఎందుకు సర్దుకుపోతోంది నానమ్మ?

తను మాత్రం?......

ఎందుకు ప్రశ్నించలేకపోతోంది?

ఆమెకు ఓ విషయం అర్థమైంది.

ప్రశ్నించగల చాలామంది నిర్లిప్తంగా జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. వర్తమానాన్ని యాంత్రికంగా నిర్వహిస్తున్నారు.

ఆలోచిస్తున్న కొద్దీ దుఃఖం ముంచుకొచ్చింది.

దిండులో తల దూర్చి తనివి తీరా ఏడ్చింది.

ఏడుపు శాపం కాదు... గొప్ప వరం!

ఆలోచనలు మనసులో మెదిలినా దుఃఖించగలవారు గొప్ప అదృష్టవంతులు!

అతడితో పెళ్ళయింది ఆమెకు.

''ఎందుకంత సిగ్గు. ఈ గదిలో ఉన్నది ఇద్దరమేగా... కొంచెం తల పైకెత్తు''- అతడు ఎత్తిన ఆమె తలను అదోలా చూస్తూ......

''రెండు తెల్ల చేప పిల్లలను ఇక్కడ అమర్చావా'' అని కళ్ళను,

''ఎర్ర దొండపండును నిలువుగా కోసి ఇక్కడ అంటించావా'' అని పెదవులను స్పృశించాడు.

...... ఆ తరువాత ఇలా అన్నాడు.

"తలను వంచి ఇంత అందాన్ని చూడనివ్వ కుండా చేయకు'!

మెల్లగా...... మెల మెల్లగా,
పులకరించిన తనువుతో ఆమె......
స్వేచ్ఛగా ఎగిరే పక్షుల్ని
వర్షంలో కేరింతలు కొట్టే ఆటల్ని
సంధ్యలో మారే మబ్బుల రంగుల్ని... చూసింది!

కలత చెందిన మనసుతో ఆమె......
డొక్కు పోయినపొట్టల్ని
దోపిడీ సమస్యల్ని
ఉద్యమించే జనాన్ని... చూసింది!

ఈ అనుభవాలను అతడితో విశ్లేషించుకో బోయింది.

అతడి దృష్టిలో జరగరానిదేదో జరుగు తోంది......

''కొంగ మెడలాగా సాచుకొని ఇవన్నీ చూడాలా... నువ్వసలు, ఆడదానివేనా?''

కంపరంతో గయ్యిమన్నాడు.

ఉలిక్కిపడింది ఆమె.

అమాంతం ఏదో అగాధంలోనికి తోయబడి నట్టుగా అయోమయమై, ఊబిలోనికి నెట్టబడి మెడ వరకూ కూరుకుపోయి ఊపిరందక విలవిల లాడినట్లై, ఆశ్చర్యంగా కళ్ళు వెడల్పు చేసింది.

వెడల్పయిన కళ్ళ నుంచి చుక్కలు చుక్క లుగా నీళ్ళు!

ఇలా ఎంతకాలం బ్రతకాలి?......

నన్ను కదిలించిన దృశ్యాలను సైతం పంచుకో లేక పోతున్నానెందుకని?

అంటే, ఏది కదిలించిందో... ఏది కాదో, వ్యక్తపరచుకోవడానికి కచ్చితమైన అవకాశాన్ని కల్పించుకోలేపోతున్నానా?

కాదు... ప్రయత్నాన్ని విఫలం చేస్తున్నారు. చిగురులోనే త్రుంచేస్తున్నారు.

అయినా, ఎందుకు ప్రతిఘటించలేక పోతున్నాను?

ఎందుకని?......


నా పరిస్థితి ఛిన్నాభిన్నం కావచ్చుననే భయమా?

ఇప్పుడున్న స్థానం తారుమారయితే బ్రతక లేనని సందేహమా?

అసలు...... నా స్థితిలో మార్పు రాకూడదని ఎందుకు భావించాను?

జీవితంలో భద్రత కోల్పోతానేమోనని కల వరపడటం వల్లనే ఇలా జరుగుతోందా?

తద్వారా, దిగజారిపోవటమే జరుగుతుందా?




మరింత మంచి స్థితిలోకి వెళ్తానని అనుకో వచ్చుకదా......

ఆమెకు మరో విషయం అర్థమైంది.

జీవితానికి భద్రత కావాలి. కాని భద్రతకు దాసోహమవ్వాల్సిన జీవితం తన కొద్దు. మనసు విప్పి మాట్లాడి, స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పు కోవటానికి, స్పందించే భావాలను ప్రకటించు కోనటానికి అందరికీ హక్కు వుంది.

అసమాన పరిస్థితులకు ఎప్పటికప్పుడు రాజీ పడుతూ పోతే...

నేను నేనుగా ఊపిరి పీల్చుకునే క్షణాలు జీవితంలో రావు.

నో... అలా జరగటానికి వీల్లేదు.

ఈ పరిస్థితి మారాలి. ఈ స్తబ్దత తొలగాలి. ఈ నిశ్శబ్దంతో పోరాడాలి.

ఎవరేమన్నా మౌనంగా భరించటం మాత్రమే ఇప్పటి వరకూ జరిగింది.

ఇక నుంచి అలాకాదు......

కనీసం నాకు సంబంధించిన ప్రతి దాని మీదా, నా భావాలను చెప్పి తీరాలి.

ఇష్టం లేని వాటిని వ్యతిరేకించాలి.

అవును, వ్యతిరేకించటం నేర్చుకోవాలి.

చివరగా ఆమెకు స్పష్టమయిందిఏమిటంటే...

ఒకరి ఆనందాన్ని, శాంతిని భగ్నం చేసే అధికారం ప్రపంచంలో ఏ బాహ్యశక్తికీ లేదు.

"ఒసేయ్'' గాండ్రించాడతను.

తనను కాదన్నట్టు తనకేమీ పట్టనట్టు ఊరు కుంది ఆమె.

"ఒసేయ్, నిన్నే పిలిచేది', అరికాలి మంట నెత్తికెక్కింది అతడికి.

''ఎవర్నీ''

"ఏంటే!... ఒళ్ళు తిమ్మిరెక్కిందా?'' శివా లెత్తి పోతున్నాడు.

"అవును, నాకు ఒక పేరున్న విషయం మీకు గుర్తు చేయాలనే ఒళ్ళు తిమ్మిరెక్కింది''

తాపీగానే సమాధానమిస్తోంది.

''ఏంటే... గొణుగుతున్నావ్''

"గొణగటమా? స్పష్టంగానే మాట్లాడు తున్నానే! 'ఒసేయ్' అని పిలుస్తుంటే చిరాకని పిస్తోంది!'

ఈ పరిణామాన్ని ఊహించలేకపోతున్నాడు.

''ఓహో!' ఒసేయ్' అంటే చిరాకనిపిస్తోందా? మీ నాన్న, మీ అమ్మను 'ఒసేయ్' అన్నప్పుడు కూడా ఇలాగే అన్పించిందా?'' ఎద్దేవగా అతడు.

''ఆ పిలుపు విన్న అమ్మకు కూడా ఇలాగే అన్పించి ఉంటుంది. అయితే అమ్మలు, అమ్మమ్మలూ, నానమ్మలూ కూడా తమ భర్త లకు చెప్పటానికి జంకే విషయాన్ని నేను చెప్తు న్నాను. నన్ను 'ఒసేయ్' అంటే చిరాకే కాదు... ఒళ్ళు కూడా మండుతుంది''

స్థిరంగా అని ఇంట్లోకి వెళ్తోంది.

ఆమె వైపే ఆశ్చర్యంగా చూస్తూ... అతడు!

ఆమె ఆగింది... వెనక్కు తిరిగి "ఇంకెప్పుడూ అలా పిలవకండి''

ఆలోచించుకుంటే... అంతులేని సంతోషం!

ఇంత చిన్న విషయానికేనా?

అంతలోనే సందేహం...

ఇది చిన్న విషయం ఎలా అవుతుంది?

ఆమె అనుకుంది—

అసమానతలకు తలవంచితే మనల్ని పాతాళా నికి తొక్కేస్తాయి. తల ఎత్తితే అవే పాతాళానికి తొక్కబడతాయి.

అవును!

ఆశలు వదిలేసి చేతులెత్తిన వారిది కాదీ ప్రపంచం.

తెంపుతో ఎదురొడ్డి నిలిచే వారిదే!